పొదల మధ్య పడ్డ ఆ బ్రౌన్ కవర్ కంపౌండ్ వాల్‌కి, దాని ముందు అందం కోసం పెంచబడుతున్న క్రోటన్ మొక్కలకి మధ్య వున్న ఖాళీలో కదిలి మట్టూ తిరిగి ఆ స్కై స్క్రేపర్ వెనక భాగానికి చేరకుంది ఎవరి కంటా పడకుండా.

ఆ తర్వాత అది వేచి చూడసాగింది. మధ్యాహ్నం మూడుంపావుకి కొందరు పిల్లలు క్రికెట్ బాల్స్ బేట్స్‌తో వచ్చారు. మాట్లాడేబొమ్మ కవరులోంచి బయటికి వచ్చింది. పిల్లలు అయిదుగురే. మూడు రాళ్ళని వికెట్స్‌గా నేల మీద పెట్టి క్రికెట్ ఆడసాగారు.

అరగంటలో ఓ కుర్రాడు అర్ధ సెంచరి చేసేశాడు. ఎవరికి వారు బౌలింగ్ నే చేస్తానంటే నే చేస్తానని పోట్లాడుకుంటూ ఆడసాగారు. టి.విల్లో క్రికెట్ మేచ్‌లు చూసి ఇన్‌స్పైర్ అయి ఆడే వాళ్ళే ఆ అయిదుగురు పిల్లలు.

మాట్లాడేబొమ్మ ఓపికగా వేచి చూడసాగింది. ఓసారి బాల్ వచ్చి దానికి దగ్గర్లో పడింది. దాన్ని తీసుకోడానికి వచ్చిన తను ఆ బొమ్మని చూసాడు కాని పెద్దగా పట్టించుకోలేదు. మాట్లాడేబొమ్మకి నిరుత్సాహం కలిగింది. మరోసారి బంతి నేల మీద పడ్డ చోటుకి అదే ఎవరి కళ్ళ బడకుండా కదిలి వెళ్ళింది.

ఈసారి దాన్ని చూసిన కుర్రాడు దాన్ని అందుకుని అందరికి చూపించి అడిగాడు.

"ఎవరో బొమ్మ పారేసుకున్నారు."

దాన్ని ప్రక్కన పెట్టి ఆడసాగారు. సాయంత్రం నాలుగున్నరకి పోట్లాటలో ఆ ఆట ఆగిపోయింది. ఇందాక దాన్ని చూసిన కుర్రాడు ఆ మాట్లాడేబొమ్మని చంకన పెట్టుకుని అపార్ట్‌మెంట్స్‌లోకి దారి తీసాడు.

లిఫ్ట్ ఎక్కాడా కుర్రాడు. అది నాలుగో ఫ్లోర్‌లో ఆగింది. 'ఏ ఫ్లోర్' అపార్ట్‌మెంట్‌లోకి వెళ్ళాడా కుర్రాడు. మాట్లాడే బొమ్మని తన అయిదేళ్ళ చెల్లెలికి ఇచ్చి చెప్పాడు.

"దొరికింది. ఆడుకో."

"దొరకడం ఏమిటి? ఎక్కడ దొరికింది?" అడిగింది ఆ కుర్రాడి తల్లి.

"ఏమో వెనకాల మేం ఆడుకునే చోట మొక్కల్లో పడివుంది."

ఎవరిదో కనుక్కోని వాళ్ళకి ఇచ్చేయ్" చెప్పిందా విడ. ఆ పాప పొట్ట కింద పట్టుకుంది. పట్టుకోగానే బొడ్డుకున్న బటన్ నొక్క బడింది. వెంటనే బేటరి బొమ్మ మాట్లాడసాగింది.

హాయ్ .. నా పేరు మిస్టర్ మంకీ. నేను మాట్లాడే బొమ్మని. నేను పుట్టింది అమెరికాలోని ఫోరిడా రాష్ట్రంలో వున్న మేజిక్ కింగ్ డమ్‌లో. మేజిక్ కింగ్ డమ్ అంటే మిక్కీ మౌస్, డోనాల్డ్ డక్ మొదలయిన వాళ్ళంతా వుండే వాల్ట్ డిస్నీలాండ్ అన్నమాట. నా వయసు ఆరేళ్ళు. నాకు చెట్లకొమ్మల్ని పట్టుకొని వూగడమంటే సరదా. ఇంకా కొత్తి కొమ్మచ్చి ఆటలు ఆడతాను. అరటి పళ్ళంటే నాకు ప్రాణం...

(ఇంకావుంది)

## అన్నీ ఫ్లాపులే!

మిథున్ చక్రవర్తి గత సంవత్సరం నటించిన 11 చిత్రాలూ ఫ్లాపులయ్యాయి. అంతకు ముందు కూడా పరిస్థితి అదే కావడంతో మిథున్‌లో ఓ ప్రత్యేకమైన మార్పు వచ్చిందట. సినిమాల జయాపజయాలకు అతీతంగా ఎప్పుడూ నవ్వుతూ, తుళ్ళుతూ తిరగడం అలవాటు చేసుకున్నాడట మిథున్.



# సిగరెట్టు చెప్పిన భావం

ఆకాశం మబ్బు పట్టి ఉంది. మబ్బు మూలంగా సాయం సంధ్య కనుమరుగై పోయింది. పక్షులు చీకటికి ముందుగానే గూళ్ళకి చేరుకుంటున్నాయి.



ఆకాశాన్ని చూస్తూ కూర్చున్న నాకు ఈ ఒంటరితనం మోడు బ్రతుకులా అన్పించింది.

"నీ ఒంటరితనానికి తోడు నేనున్నాను" అంది సిగరెట్టు.

"ఐదు నిమిషాల తోడు కోసం నిన్ను నిలువునా కాల్చనా?" ఆర్ద్రత నిండిన గొంతుతో అడిగాను.

"కాల్చు" అంది.

"నాకోసం నీకెందుకింత తపన. నాకోసం నీకెందుకింత ఆత్మ త్యాగం చెయ్యాలనే సహసం" తెలుసుకోవాలనే ఆరాటంతో అడిగాను.

"ఈ ప్రపంచంలో ఒక వెలుగుకి ఇంకొకటి సమిధికాక తప్పదు కదా!" అంది.

"నువ్వు కాలటం వలన నాకు కలిగేదేమిటి?" అని అడిగాను.

"నీకు తృప్తి మిగులుతుంది" అంది.

"క్షణికమైన తృప్తికోసం నిన్ను నిలువునా కాల్చలేను" అవన్నాను.

"నేనిలాగే ఉండిపోతే ఎవరికి చెందకుండా నిర్వీర్యమైపోతాను" అంది.

"అలాగే ఉండు" అన్నాను.

"ఇలా ఉండిపోయే బ్రతుకెందుకు? కొన్ని రోజులకు నాలో పొగాకు చెడి మూలడిపోతాను. ఈ బ్రతుకొద్దు. ఒకరి తృప్తికి అంకితమవుతున్నానన్న తృప్తి నాకు కలగని. నీకు క్షణం తృప్తి కలిగినా అది వెలలేనిది. తృప్తికి వెలకట్టగలవా? ఎవరికి కాని ఈ బ్రతుకెందుకు చెప్పు. నీ తృప్తి కోసం నన్ను ఆత్మార్పణ చేసుకోని" అని బ్రతిమాలుతూ అడిగింది.

సిగరెట్టుని చూసి ఒకరికి అంకితం కాకపోయినా ఉపయోగపడని జీవితం ఎందుకనిపించింది.

నీ తృప్తి కోసం అనే స్వార్థపు పలుకుతో దాన్ని తృప్తిగా కాల్చి అవతల పడేశాను.

— ఉండవిల్లి మల్లిఖార్జునరావు